క్లుప్తంగా

డీఎస్సీ ఉచిత శిక్షణ కేంద్రం ఏర్పాటుకు వినతి



వీసీకి వినతిపత్రం అందిస్తున్న విద్యార్థి సంఘాల నేతలు

తిరుపతి సిటీ : ఎస్వీయూలో డీఎస్సీ ఉచిత శిక్షణ కేంద్రం ఏర్పాటు చేయాలని అఖిలపక్ష విద్యార్థి సంఘం నేతలు కోరారు. బుధవారం ఈ మేరకు వీసీ అప్పారావుకు వినతిపత్రం సమర్పించారు. వారు మాట్లాడుతూ పేద విద్యార్థులకు వర్సిటీ అండగా నిలబడాలన్నారు. రూ.లక్షలు వెచ్చించి కోచింగ్ తీసుకునే స్తోమత లేని పేదవారిపై వర్సిటీ అధికారులు కనికరం చూపాలని సూచించారు. కార్యక్రమంలో నేతలు హేమాద్రి యాదవ్, మురళీకృష్ణ, సుధాకర్ మాదిగ, లోకేష్, తిరుమలేష్, జేడీ ప్రసాద్, పవన్ కుమార్ పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా అంకురార్పణ



ఆభరణాలు అందిస్తున్న దాతలు

తిరుపతి కల్చరల్ : శ్రీకోదండరామస్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా బుధవారం రాత్రి శాస్త్రోక్తంగా అంకురార్పణ నిర్వహించారు. ఉదయం సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపి తోమాల, సహస్రనామార్చన చేశారు. సాయంత్రం 5.30 నుంచి రాత్రి 7 గంటల వరకు వేద ప్రబంధ శాత్తుమొర జరిపించారు. రాత్రి 7 నుంచి 9.30 గంటల వరకు సేనాధిపతి ఉత్సవం, మేదినీపూజ, మృత్సంగ్రహణం, అంకురార్పణ చేపట్టారు. తిరుమల పెద్దజీయర్ స్వామి, చిన్నజీయర్ స్వామి, ఆలయ డిప్యూటీ ఈఓ నాగరత్న, ఏఈఓ రవి, సూపరింటెండెంట్ ముని శంకరన్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ సురేష్, అర్చకుడు ఆనందకుమార్ దీక్షితులు పాల్గొన్నారు.

రాగి ఆభరణాల సమర్పణ

శ్రీకోదండరామస్వామి వారికి కానుకగా చెన్నైకి చెందిన శ్రీధర్, వారి కుటుంబ సభ్యులు రూ.4.10లక్షల విలువైన బంగారు పూత వేసిన రాగి ఆభరణాలను సమర్పించారు.

చట్టాలను ఉల్లంఘిస్తే చర్యలు



మాట్లాడుతున్న కార్మికశాఖాధికారి ఆనందబాబు

పాకాల : కార్మిక చట్టాలను వ్యాపారులు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని పీలేరు కార్మికశాఖ అధికారి కేఆర్ ఆనందబాబు హెచ్చరించారు. బుధవారం పాకాలలోని పలు దుకాణాలను తనిఖీ చేశారు. షాపుల యజమానులకు కార్మిక చట్టాలపై అవగాహన కల్పించారు.

'ఉగాది పచ్చడి' ఆవిష్కరణ



పుస్తకం ఆవిష్కరిస్తున్న సాహితీ సంస్థల ప్రతినిధులు

తిరుపతి కల్చరల్ : తెలుగు తియ్యదనం పంచే విజ్ఞాన విందు వంటిది ఉగాది పచ్చడి పుస్తకమని శతావధాని ఆముదా మురళి, సాహితీ వేత్త సాకం నాగరాజు, గార్లపాటి దామోదరం నాయుడు తెలిపారు. బుధవారం తిరుపతి జిల్లా రచయితల సంఘం కార్యాలయంలో ఉగాది పచ్చడి పుస్తకాన్ని ఆవిష్కరించారు. సాహితీ సంస్థల ప్రతినిధులు ఎస్‌జీడీ చంద్రశేఖర్, మన్నవ గంగాధరప్రసాద్, తోట వెంకటేశ్వర్లు, తమటం రామచంద్రారెడ్డి, డి.మస్తానమ్మ, ఏనుగు అంకమనాయుడు, పేరూరు బాలసుబ్రమణ్యం, జయరామ్‌ప్రసాద్, పి.సాయిలక్ష్మి పాల్గొన్నారు.

ఉద్యోగుల సంక్షేమానికి కృషి



హంస నేతలతో ఎమ్మెల్యే ఆరణి

తిరుపతి తుడా : ఉద్యోగుల సమస్యల పరిష్కారం, సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తెలిపారు. బుధవారం ఎస్వీ వైద్య కళాశాలను ఆయన సందర్శించారు. ఏపీ హంసకు కేటాయించిన భవనాన్నిపరిశీలించారు. నేతలు రాజా, టాటా బాయి, ఇమ్రాన్, సురేంద్ర, ముని రాజా, శాంతకుమార్, పీఆర్ఓ వీర కిరణ్ పాల్గొన్నారు

పంచాయతీకి ఆదాయం

పాకాల : ఆర్థిక వనరుల వేలం ద్వారా పంచాయతీకి రూ.38,45,000లు ఆదాయం వచ్చినట్లు ఈఓ లావణ్యలత తెలిపారు. బుధవారం ఆమె మాట్లాడుతూ వారపు సంత రూ.22.45లక్షలు, దినసరి మార్కెట్ రూ.12.80లక్షలు, జంతువధ శాల రూ.53వేలు, కొబ్బరి చెట్లు రూ.2,800లు, చింతచెట్లు రూ.2,600లు, షాపింగ్ కాంప్లెక్స్‌లో రూములు వరుసగా రూ.3,950, రూ.3,550, రూ.4,300 వేలం పాట పలికినట్లు వివరించారు. సర్పంచ్ కస్తూరి, ఈఓపీఆర్‌డీ శశిరేఖ పాల్గొన్నారు.

ఆనందం



ఎమ్మార్‌పల్లెలోని షాదీమహల్‌లో మైనారిటీ సంక్షేమ శాఖ, వక్ఫ్‌బోర్డ్ నేతృత్వంలో బుధవారం రాత్రి ఇఫ్తార్ విందును ఏర్పాటు చేశారు. పెద్ద సంఖ్యలో ముస్లింలు హాజరై ఈద్‌ముబారక్ అంటూ ఆనందం పంచుకున్నారు. డీఆర్‌ఓ నరసింహులు, ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, డిప్యూటీ మేయర్ ఆర్‌సీ మునికృష్ణ, జనసేన నేత రాజారెడ్డి పాల్గొన్నారు.

\- తిరుపతి అర్బన్

అద్భుతం



పద్మావతి మహిళా వర్సిటీ సంగీత, నృత్య, లలిత కళల విభాగం ఆధ్వర్యంలో విద్యార్థినులకు డ్యాన్స్, కాస్ట్యూమ్స్, మేకప్ అంశాలపై మూడు రోజుల పాటు నిర్వహించిన వర్క్‌షాప్ బుధవారం ముగిసింది. ఈ సందర్భంగా శిక్షకులతో కలసి విద్యార్థినులు నృత్య ప్రదర్శన చేశారు. ముగింపు వేడుకలో వీసీ ప్రొఫెసర్ ఉమ, రిజిస్ట్రార్ రజని, ప్రొఫెసర్లు విజయలక్ష్మి, సుధ, వి.ఉమ, శైలేశ్వరి, హిమబిందు, రిటైర్డ్ ప్రొఫెసర్ సరస్వతి వాసుదేవ్ పాల్గొన్నారు.

\- తిరుపతి సిటీ

అభినందన



ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ టోర్నమెంట్‌కు ఎస్వీయూ బాల్ బ్యాడ్మింటన్ ఉమెన్ టీమ్‌ను బుధవారం ఎంపిక చేశారు. ఇందులో ఎస్వీడబ్ల్యూ డిగ్రీ కళాశాలకు చెందిన విద్యార్థినులు ప్రియాంక, సుస్మిత, గౌతమి, శ్రీకాళహస్తి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలకు చెందిన ఉమ, స్వప్న, ఈశ్వరి, సంఘవి, కుప్పం డిగ్రీ కళాశాలకు చెందిన కల్యాణి, ఎస్వీయూ కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్‌కు చెందిన లతమ్మ, ఎస్వీయూ కామర్స్ కాలేజ్‌కు చెందిన చంద్రకళ ఉన్నారు. ఈ సందర్భంగా క్రీడాకారులను అధ్యాపకులు అభినందించారు.

\- తిరుపతి సిటీ

అలిపిరి అదుర్స్!



రాష్ట్రవ్యాప్తంగా ఆర్‌టీసీ రాబడిలో గత ఐదేళ్లుగా తిరుపతి జిల్లా ప్రథమస్థానంలో నిలుస్తోంది. ఆ మేరకు ఈ ఏడాది కూడా అగ్రస్థానం నిలబెట్టుకుంది. ఈ క్రమంలోనే జిల్లాస్థాయిలో అలిపిరి డిపో ముందు వరుసలో నిలిచింది. ప్రధానంగా విద్యుత్ బస్సుల కారణంగా ఆదాయ మార్గంలో పయనిస్తోంది. తిరుమలకు రాకపోకలు సాగించే యాత్రికులు అధిక సంఖ్యలో కరెంట్ సర్వీసులను ఎక్కేందుకు ఆసక్తిచూపుతుండడం అలిపిరి డిపోకు కలిసి వచ్చింది. వేసవి నేపథ్యంలో రాబోయే కాలంలో సైతం మరింతగా రాబడి పెరిగే అవకాశముందని ఆర్టీసీ యంత్రాంగం అంచనా వేస్తోంది.

- రూ.109.73 కోట్లతో ప్రథమ స్థానం
- విద్యుత్ బస్సులతోనే అధిక ఆదాయం
- వేసవి నేపథ్యంలో రాబడి మరింత పెరిగే అవకాశం

తిరుపతి అర్బన్ : ఆర్టీసీ రాబడిలో ఈ ఏడాది జిల్లా రూ.572.70 కోట్లలో ముందంజలో ఉంది. తిరుపతి, తిరుమలతోపాటు శ్రీకాళహస్తి, తిరుచానూరు తదితర ఆలయాల దర్శనానికి భక్తులు నిత్యం పెద్ద సంఖ్యలో భక్తులు విచ్చేస్తున్న నేపథ్యంలో తిరుపతి జిల్లా ఆదాయంలో దూసుకుపోతోంది.

కొండకు 50 సర్వీసులు

జిల్లాలో మొత్తం 11 ఆర్టీసీ డిపోలు ఉన్నాయి. గత ఏడాది ఏప్రిల్ 1 నుంచి ఈ నెల 25వ తేదీ వరకు వచ్చిన రాబడి మేరకు అలిపిరి డిపో రూ.109.73కోట్లతో నంబర్ వన్ స్థానంలో ఉంది. సూళ్లూరుపేట డిపో రూ.17.6కోట్లతో చివరి స్థానంలో నిలిచింది. అలిపిరి డిపోకు చెందిన బస్సుల్లో 95శాతం సర్వీసులు తిరుమలకు నడుపుతున్నారు. అంతేకాకుండా గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అలిపిరి డిపో కేంద్రంగా 100 విద్యుత్ సర్వీసులను ఏర్పాటు చేశారు. అందులో 50 సర్వీసులు తిరుమల కొండకు నడుస్తున్నాయి. దీంతోనే రాబడిలో అలిపిరి డిపో ముందు వరుసలో ఉందని ఆర్టీసీ అధికారులు వెల్లడిస్తున్నారు. రూ.86.98కోట్లతో రెండో స్థానంలో తిరుమల, రూ.75.4కోట్లతో మూడో స్థానంలో తిరుపతి డిపో నిలిచింది. రూ.59.96కోట్లతో 4వ స్థానంలో శ్రీకాళహస్తి డిపో ఉండగా, మంగళం డిపోకు బస్టాండ్ లేనప్పటికీ రూ.58.91కోట్లతో ఐదో స్థానం దక్కించుకోవడం విశేషం.

100 సర్వీసులు నడుస్తున్నాయి



“అలిపిరి డిపోకు 100 విద్యుత్ సర్వీసులున్నాయి. అందులో 50 తిరుమలకు, 14 రేణిగుంట ఎయిర్‌పోర్ట్, 12 మదనపల్లె, 12 కడప, 12 నెల్లూరుకు తిప్పుతున్నాం. మరో 37 సప్తగిరి ఎక్స్‌ప్రెస్‌లు తిరుమలకు నడుపుతున్నాం. మరో 13 సప్తగిరి సర్వీసులు రోజుకు ఒక ట్రిప్పు తిరుమలకు మిగిలిన ట్రిప్పులు బెంగుళూరుకు వెళుతున్నాయి. దీంతోనే అలిపిరి డిపో రాబడి పెరిగింది.

\-హరిబాబు, డిపో మేనేజర్, అలిపిరి

నోటీస్ బోర్డు

- అన్నమాచార్య కళామందిరంలో ఉదయం 10.30 గంటలకు సాహితీ సదస్సు. సాయంత్రం 6 గంటలకు సాంస్కృతిక కార్యక్రమాలు.
- శ్రీకోదండరామస్వామి వారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఉదయం 9.15 ధ్వజారోహణం, రాత్రి పెద్దశేష వాహన సేవ.
- ఎస్వీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్‌లో ఉదయం 10 గంటలకు ఎంఎస్‌ఎంఈలకు శిక్షణ.
- శ్రీగోవిందరాజస్వామి వారి ఆలయంలో ఉదయం 7 నుంచి 9 గంటల వరకు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం.
- రాజ్యాంగం పరిరక్షణ ప్రచార జాతాలో భాగంగా సాయంత్రం 4గంటలకు బైరాగిపట్టెడలోని రాయలసీమ కళాశాల నుంచి సీపీఐ కార్యాలయం వరకు కార్మికుల ర్యాలీ.
- టీటీడీ హిందూ ధర్మప్రచార పరిషత్, సంక్షేమ విభాగం ఆధ్వర్యంలో ఈనెల 30వ తేదీన మహతి కళాక్షేత్రంలో ఉగాది వేడుకలు.
- తిరుపతి రూరల్ మండల వ్యవసాయశాఖ కార్యాలయంలో గురువారం నుంచి శనివారం వరకు రైతులకు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ నిర్వహించనున్నారు.

దళితులపై దాడికి నిరసన

తిరుపతి రూరల్ : తిరుచానూరులో దళితులపై జరిగిన దాడికి బుధవారం తిరుపతి రూరల్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆలిండియా అంబేద్కర్ యువజన సంఘం నేతలు నిరసన తెలిపారు. సంఘం నేత రెడ్డెప్ప మాట్లాడుతూ సర్వే నంబర్ 398/12లో 0.05 సెంట్లు భూమిని వినాయకబాబు అనే అంబేద్కర్ సంఘం సభ్యుడు కొనుగోలు చేసినట్లు చెప్పారు. టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు కిషోర్ రెడ్డి, ఆయన అనుచరులు ఆ భూమిని కబ్జా చేశారని ఆరోపించారు. అడ్డుకున్న ఐదుగురు దళితులపై దాడికి పాల్పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. నిందితులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఈ తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందించినట్లు వివరించారు.

పోలీసులకు ఫిర్యాదు

దళితులపై దాడి చేసిన టీడీపీ నేతలను వెంటనే అరెస్టు చేయాలంటూ సీపీఎం నేతలు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం తిరుచానూరు సీఐ సునీల్ కుమార్‌కు ఫిర్యాదు చేశారు. సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు జయచంద్ర, తిరుపతి రూరల్ కార్యదర్శి కె.సుమన్ పాల్గొన్నారు.

వేతనాలు పెంచాలని ధర్నా



మాట్లాడుతున్న కందారపు మురళి

తిరుపతి కల్చరల్ : వేతనాలు పెంచాలని కోరుతూ స్విమ్స్ కార్మికులు బుధవారం టీటీడీ పరిపాలన భవనం ఎదుట ధర్నా నిర్వహించారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి మాట్లాడుతూ కార్మికులకు వేతనాలు పెంచాలని, సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అనంతరం టీటీడీ జేఈఓ వీరబ్రహ్మానికి వినతి పత్రం అందించారు.నేతలు బాలసుబ్రమణ్యం, టి.సుబ్రమణ్యం, పి.బుజ్జి, ఆర్, లక్ష్మి, పి.మునిరాజా, జి.వాసు, వేణుగోపాల్, రవి, సూరి, మారిముత్తు, గోపి, వేలు ,వెంకటేష్, విజయలక్ష్మి, సుబ్రమణ్యం, వెంకటేష్ పాల్గొన్నారు.

ఎంపీటీసీ సభ్యులకు విప్

తిరుపతి రూరల్ : ఎంపీపీ ఎన్నికల్లో తిరుపతి రూరల్ ఎంపీటీసీ సభ్యులకు వైఎస్సార్‌సీపీ తరపున కె.నరేష్‌రెడ్డి విప్ జారీ చేశారు. బుధవారం ఈ మేరకు విప్‌గా నియమితులైన నరేష్‌రెడ్డి సంబంధిత ధ్రువీకరణ పత్రాలను ఎన్నికలఅధికారి జుబేదాకు అందించారు. ఫ్యాను గుర్తుపై గెలిచిన ఎంపీటీసీ సభ్యులందరికీ పార్టీ ఆదేశాల మేరకు విప్ జారీ చేసినట్లు వెల్లడించారు.

నీటి ఎద్దడి నివారణకు చర్యలు



మాట్లాడుతున్న మేయర్ శిరీష, కమిషనర్ మౌర్య

తిరుపతి తుడా : వేసవి నేపథ్యంలో తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు చేపట్టాలని మేయర్ శిరీష ఆదేశించారు. బుధవారం ఈ మేరకు కార్పొరేషన్ కమిషనర్ మౌర్యతో కలిసి అధికారులతో సమావేశం నిర్వహించారు. నగరవాసులకు ఎలాంటి ఇబ్బంది పడకుండా తాగునీరు సరఫరా చేయాలని కోరారు. అందులో భాగంగా నీటి ట్యాంకులను ఏర్పాటు చేయాలని చెప్పారు. నగరంలో నీటి వృథాను అరికట్టాలని స్పష్టం చేశారు. అలాగే వేసవిలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వడదెబ్బకు గురికాకుండా ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. ప్రైవేట్ నీటి ట్యాంకర్ల యాజమానులతో సమావేశం నిర్వహివంచి, ఒకే ధరకు నీరు అందించే విధంగా చర్యలు చేపట్టాలని తెలిపారు. కమిషనర్ మాట్లాడుతూ తిరుపతికి పెద్ద సంఖ్యలో యాత్రికులు వస్తుంటారని, వారి దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ప్రధాన కూడళ్లలో చలువ పందిళ్లు, గ్రీన్ మ్యాట్ వేయించాలని సూచించారు. సమావేశంలో అదనపు కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి, డిప్యూటీ కమిషనర్ అమరయ్య, ఎస్ఈ శ్యామ్‌సుందర్, ఎంఈలు తులసి కుమార్, గోమతి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, వెటర్నరీ ఆఫీసర్ డాక్టర్ నాగేంద్ర పాల్గొన్నారు

'మలబార్' స్కాలర్ షిప్‌ల పంపిణీ



స్కాలర్ షిప్‌లు పంపిణీ చేస్తున్న కమిషనర్ మౌర్య, షోరూమ్ హెడ్ రిజేష్

తిరుపతి కల్చరల్ : ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లోని 141 మంది పేద విద్యార్థినులకు మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ వారు రూ.13,04,000లు స్కాలర్ షిప్‌లను పంపిణీ చేశారు. బుధవారం బాలాజీ కాలనీలోని మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ షోరూంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి కార్పొరేషన్ కమిషనర్ మౌర్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కమిషనర్ మాట్లాడుతూ నిరుపేద బాలికల అభ్యున్నతిని కాంక్షిస్తూ మలబార్ సంస్థ వారు స్కాలర్ షిప్‌లు అందించడం అభినందనీయమన్నారు. ఉదారతతో మలబార్ వారు అందిస్తున్న స్కాలర్ షిప్‌లను విద్యార్థినులందరూ సద్వినియోగం చేసుకొని ఉత్తమ ఫలితాలు సాధించాలని కోరారు. షోరూమ్ హెడ్ టీకే రిజేష్ మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా బాలికల విద్యకు మద్దతుగా మలబార్ గోల్డ్, డైమండ్స్ సంస్థ రూ.16 కోట్లు కేటాయించిందని వెల్లడించారు. రాష్ట్రంలో 1,928 మంది ఇంటర్ విద్యార్థినులకు రూ.1.67కోట్ల ఉపకార వేతనాలు అందించామని వివరించారు. మలబార్ గ్రూప్ వ్యాపార రంగంతో పాటు సమాజ శ్రేయస్సుకు తమ వంతు తోడ్పాటు అందిస్తోందని తెలిపారు.

ఎల్లమ్మ ఆలయ హుండీ లెక్కింపు

చంద్రగిరి : గ్రామ దేవత మూలస్థాన ఎల్లమ్మ ఆలయ హుండీ లెక్కింపును బుధవారం చేపట్టారు. ఈఓ మమత మాట్లాడుతూ మూడు నెలలకు గాను హుండీ ద్వారా అమ్మవారికి రూ.6.21లక్షల ఆదాయం వచ్చినట్లు వెల్లడించారు. అలాగే 28.6 గ్రాముల బంగారం, 218.35 గ్రాముల వెండి కానుకల రూపంలో అందినట్లు వివరించారు. ఈ క్రమంలోనే తిరుప తి రూరల్ మండలం కొత్త చెర్లోపల్లెలోని శ్రీఆంజనేయ స్వామివారి ఆలయ హుండీని లెక్కించగా రూ.1.86లక్షల ఆదాయం వచ్చినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో దేవదాయ శాఖ అధికారి ఫణిరాజ శయన, ఉత్సవ కమిటీ చైర్మన్ మొక్కల చంద్రశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

భక్తరంజకం.. కళా సమ్మేళనం



మాట్లాడుతున్న విజయ శంకరస్వామి

తిరుపతి కల్చరల్: అన్నమయ్య వర్ధంతిని పురస్కరించుకుని బుధవారం టీటీడీ పరిపాలన భవనం ఎదుట హైందవ భక్తి కళా సమ్మేళనం నిర్వహించారు. అన్నమయ్య కళాక్షేత్రం పీఠాధిపతి విజయ శంకరస్వామి మాట్లాడుతూ తిరుమలలో అన్నమయ్య ఇంటిని పునర్నిర్మించాలని, విగ్రహం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం కళాకారులు ప్రదర్శించిన కళారూపాలు ఆకట్టుకున్నాయి. ఈ క్రమంలోనే టీటీడీ జేఈఓకు వినతిపత్రం అందించారు. కళాక్షేత్రం అధికార ప్రతినిధి బాలసుబ్రమణ్యం, జైభారత్ నేతలు ఖదిజ్ఞాస్ మహేష్, రజనీ, నారాయణ పాల్గొన్నారు.

నిర్దేశిత జోన్‌లోనే వ్యాపారం



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ మౌర్య

తిరుపతి తుడా : వీధి విక్రయదారులు నగరంలో నిర్దేశించిన జోన్‌లోనే వ్యాపారాలు చేసుకోవాలని కార్పొరేషన్ కమిషనర్ మౌర్య స్పష్టం చేశారు. బుధవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో వీధి విక్రయదారుల టౌన్ వెండింగ్ కమిటీ సమావేశంనిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ నగరంలో వెండింగ్ జోన్స్, గ్రీన్ జోన్, అంబర్ జోన్, రెడ్ జోన్ ఏర్పాటు చేశామన్నారు. గ్రీన్‌జోన్‌లో ఎల్లవేళలా వ్యాపారాలు నిర్వహించుకోవచ్చన్నారు., అంబర్ జోన్‌లో ఉదయం 6 నుంచి 8గంటల వరకు సాయంత్రం 6 నుంచి 10 గంటల వరకు వ్యాపారం చేసుకోవచ్చని వెల్లడించారు. రెడ్‌జోన్‌లో వ్యాపారం చేయకూడదని సూచించారు. 15 రోజుల తర్వాత వీధి విక్రయ దారులకు జోన్ అలాట్ చేసి, గుర్తింపు కార్డులు, వెండింగ్ సర్టిఫికెట్లు మంజూరు చేస్తామని తెలిపారు. సమావేశంలో అదనపు కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి, డిప్యూటీ కమిషనర్ అమరయ్య, ఎస్ఈ శ్యామ్‌సుందర్, ఎంఈలు తులసి కుమార్, గోమతి, హెల్త్ ఆఫీసర్ యువ అన్వేష్ పాల్గొన్నారు.

హోమ్ కంపోస్టింగ్‌పై అవగాహన కల్పించండి

ఇంటి నుంచి ఉత్పత్తి అయ్యే చెత్తతో ఎరువు తయారు చేసుకుని (హోం కంపోస్టింగ్) మొక్కలకు వినియోగించుకునే విధానంపై ప్రజలకు అవగాహ న కల్పించాలని కమిషనర్ మౌర్య ఆదేశించారు. బుధవారం నగరంలో ఖాదీ కాలనీ, రైల్వే స్టేషన్, ఆటోనగర్ తదితర ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనుల ను పరిశీలించారు. కమిషనర్ మాట్లాడుతూ వీధు లు, కాలువల్లో చెత్త వేయకుండా చూడాలని, ఎవరై నా వేస్తే జరిమానా విధించాలని స్పష్టం చేశారు. భూగర్భ డ్రైనేజీ బ్లాక్ కాకుండా చర్యలు చేపట్టాలని సూచించారు.

మహిళావర్సిటీలో ఈవెంట్



కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు, విద్యార్థులు

తిరుపతి సిటీ : పద్మావతి మహిళా వర్సిటీ ఇంజినీరింగ్ కళాశాలలో ఈసీఈ డిపార్ట్‌మెంట్ అసోసియేషన్ వాలిడెక్టరీ ఈవెంట్‌ను బుధవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ మల్లికార్జున, ప్రొఫెసర్ సత్యనారాయణ, కో-ఆర్డినేటర్ అండ్ ప్రెసిడెంట్ మాధవి, అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్లు ప్రశాంతి, సంకీర్తన, స్టూడెంట్ వైస్ ప్రెసిడెంట్లు కీర్తి,భాను, సస్య, హర్షిత, ప్రణతి పాల్గొన్నారు.

ఘనంగా అన్నమయ్య వర్ధంతి



నివాళులర్పిస్తున్న రంగస్థలి ప్రతినిధులు

తిరుమల : పదకవితా పితామహుడు శ్రీతాళ్లపాక అన్నమాచార్యుల 522వ వర్ధంతిని తిరుమలలోని నారాయణగిరి ఉద్యానవనంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భండగా శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ మలయప్పస్వామివారికి ఊంజల్‌సేవ జరిపించారు. అహోబిల మఠం 46వ పీఠాధిపతి శ్రీమాన్ శ్రీవణ్ శఠగోప రంగనాథ యతీంద్ర మహాదేశికన్ స్వామిజీ అనుగ్రహభాషణం చేశారు. అహోబిలం నరసింహస్వామివారి అనుగ్రహంతో అన్నమాచార్యులు మంత్రోపదేశం పొందారని వివరించారు. అందులోని 32 బీజాక్షరాలతో 32 వేల సంకీర్తనలు రచించారన్నారు. అనంతరం స్వామీజీకి శ్రీవారి ప్రసాదాలను టీటీడీ అదనపు ఈఓ వెంకయ్య చౌదరి అందజేశారు. అన్నమాచార్య ప్రాజెక్టు డైరెక్టర్ రాజగోపాల్, దాస సాహిత్య ప్రాజెక్టు ప్రత్యేక అధికారి ఆనందతీర్థాచార్యులు, శ్రీవారి ఆలయ పేష్కార్ రామ కృష్ణ, వీజీఓ సురేంద్ర పాల్గొన్నారు.

రంగస్థలి ఆధ్వర్యంలో..



దేవదేవేరుల ఊంజల్‌సేవలో అహోబిలం మఠం పీఠాధిపతి, టీటీడీ అధికారులు

తిరుపతి కల్చరల్ : అన్నమయ్య వర్ధంతిని పురస్కరించుకుని ఆయన విగ్రహానికి రంగస్థలి ప్రతినిధులు పూలమాల వేసి నివాళులర్పించారు. రంగస్థలి చైర్మన్ గుండాల గోపీనాథ్ రెడ్డి, సుబ్రమణ్యంరెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, రవిప్రసాద్, జయంత్‌కుమార్, వాసు, చిగోరా వ్యవస్థాపకుడు హనుమంత రావు పాల్గొన్నారు.